క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ చెంగిచర్ల ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు పీఅండ్‌టీ కాలనీ, వెస్ట్ కమలానగర్, విశ్వం విహార్ కాలనీ, సమ రెసిడెన్సీ, గురు ఎన్‌క్లేవ్, భరత్‌పురి కాలనీ, భగత్‌సింగ్‌నగర్, ప్రగతినగర్, అయోధ్యకాలనీ, వరంగల్ హైవేలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమ్మవారికి ఒడి బియ్యం సమర్పణ



రామంతాపూర్ : శ్రీ రమా సహిత సత్య నారాయణస్వామి ఆలయంలో అండాలు అమ్మవారికి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. ఆలయ ఫౌండర్ కోట్ల నరసింహారెడ్డి, కార్యనిర్వహణ అధికారి విజయభారతి, ప్రధాన అర్చకులు తిరుపతాచార్య, శేషాచార్య, నరసింహాచార్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశాలీ సంఘం నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. మేడిపల్లి పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రుద్ర పాపయ్య, ప్రధాన కార్యదర్శి గుత్తి కొండ వెంకటేష్ ,కోశాధికారి, కేమ తిరుపతి, ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, గోమారం సుధాకర్, బింగి జనార్దన్, బిట్ల శ్రీనివాస్, చిప్ప సంపత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



మల్లాపూర్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచంద్రారెడ్డిని నాచారంకు చెందిన మల్కాజిగిరి యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జాఫర్ కలిసి సత్కరించారు.

పైపులైన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లో జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను సోమవారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. పైపులైన్ పనుల అనంతరం రోడ్డు వేయిస్తామన్నారు. బీఆర్ఎస్ నేతలు భూపాల్‌రెడ్డి, కట్ట బుచ్చన్నగౌడ్, భరత్, రాంచందర్, ఖాదర్ తదితరులున్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న మల్కాజిగిరి అసెంబ్లీ కన్వీనర్ కిరణ్‌కుమార్

మౌలాలి : బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఓబీసీ మోర్చా నేతలు సమావేశం ఏర్పాటు చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. ఓబీసీ మోర్చా మల్కాజిగిరి అసెంబ్లీ కన్వీనర్ కిరణ్‌కుమార్, బీజేపీ ఓబీసీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సంతోష్‌కుమార్, మురళి, మహేష్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వైపు..

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నగరవాసుల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించేందుకు ఐడీఎఫ్‌సీ అకాడమీని ప్రారంభించినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు. తమ ఆర్థిక లావాదేవీలను మరింత మెరుగ్గా నిర్వహించడానికి ఈ అకాడమీ వీలు కల్పిస్తుందని, ఆసక్తి కలిగిన వారు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ అకాడమీ కోర్సులను httpr://www.idfcfirrtacademy.comలో డెస్క్‌టాప్ లేదా మొబైల్ బ్రౌజర్‌లో సులభంగా యాక్సెస్ చేయవచ్చని వివరించారు.

అభివృద్ధికి బాటలు!

- రూ.81 కోట్ల పనులకు శ్రీకారం
- త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు

రూ.81 కోట్లతో బోడుప్పల్‌లో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మేయర్, అధికారులు, పాలకవర్గం సభ్యులు కలిసి బోడుప్పల్ నగర పాలక సంస్థ రూపురేఖలు మార్చేందుకు అధికారులు పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

బోడుప్పల్: మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు సంబంధించిన పనులు పూర్తయితే నగర పాలక సంస్థ రూపురేఖలు మారనున్నాయి. మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన 5 నెలల్లో రూ. 44 కోట్ల పనులకు తీర్మానం చేశారు. వాటిలో రూ. 26 కోట్ల పనులు పూర్తి కాగా.. మరో రూ.18 కోట్ల పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.

మరో రూ. 25 కోట్లకు ప్రణాళికలు..

2019 నుంచి రిజిస్ట్రేషన్ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న స్టాంప్ డ్యూటీ, 2022 నుంచి నిలిచిపోయిన మ్యుటేషన్ ఫీజులు కలిపి మొత్తం రూ.45.07 కోట్లు బోడుప్పల్ నగరపాలక సంస్థ ఖాతాలో జమ అయ్యాయి. అందులో నుంచి రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ నిధులతో చెంగిచర్లలోని చింతల చెరువు ఔట్‌లెట్‌కు రూ.4 కోట్లు, మరో రూ.4 కోట్లతో కట్ట మైసమ్మ వైన్‌షాపు నుంచి ఓపెన్ నాలా పనులకు మరో రూ.2 కోట్లతో బచపన్ స్కూల్ నుంచి బంగారు మైసమ్మ ఆలయం వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రూ.15 కోట్లతో కాలనీల్లో విన్నర్ రోడ్డు పనుల చేపట్టనున్నట్లు సమాచారం.



బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయం

రూ.12 కోట్లతో చెరువుల సుందరీకరణ...

బోడుప్పల్‌లోని 3 చెరువులను సుందరీకరించేందుకు హెచ్ఎండీఏ రూ. 12 కోట్ల నిధులను కేటాయించింది. రా చెరువుకు రూ. 5 కోట్లు, అల్మాస్‌కుంటకు రూ.3 కోట్లు, సుద్దకుంటకు రూ. 3 కోట్ల నిధులను కేటాయించి, టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. సుందరీకరణ పనులు త్వరలోనే ప్రారంభంకానున్నాయి.

నిధుల కేటాయింపులు..

కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి రూ.4.15 కోట్లు, సీసీ రోడ్లకు రూ.15.31 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు రూ. 10.60 కోట్లు, బీటీ రోడ్లు రూ. 5.31 కోట్లు, శ్మశాన వాటికలో మౌలిక వసతులు రూ. 1.90 కోట్లు, తాగునీటి పైపులైన్లు, మరమ్మతులు రూ.2.88 కోట్లు, ప్రహరీలకు రూ.1.70 కోట్లు, హైమాస్ట్ పోల్స్, లైట్లు రూ.1.45 కోట్లు, డీఆర్‌సీసీ సెంటర్ నిర్మాణానికి రూ. 30 లక్షలు, ఏబీసీ సెంటర్ కోసం రూ.40 లక్షల నిధులు కేటాయించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం



నగర ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాం. ఇప్పటికే రూ. 26 కోట్ల మేర పనులు పూర్తి చేశాం. మరో రూ.18 కోట్ల పనులు జరుగుతున్నాయి. రూ.12 కోట్లతో చెరువుల సుందరీకరణ పనులు చేపట్టాల్సి ఉండగా.. మరో రూ. 25 కోట్లతో పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేసి టెండర్ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ పనులన్నీ పూర్తయితే బోడుప్పల్ నగరపాలక సంస్థ రూపురేఖలు మారనున్నాయి.

– తోటకూర అజయ్‌యాదవ్, మేయర్, బోడుప్పల్

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: చెంగిచర్ల 2వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో రూ. 10.50 లక్షలతో సోమవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, కో– ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, నాయకులు కొత్త రవిగౌడ్, ప్రభాకర్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, కొత్త సుకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా..

బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేసినా, కాల్చినా రూ.5వేల జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కమిషనర్ రామలింగం తెలిపారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మేనేజర్ నాగేంద్రబాబు, డీఈ చిరంజీవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నారాయణరెడ్డి, కమలాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

బోడుప్పల్: యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన 'నేషనల్ లెవెల్ ఓపెన్ టు ఆల్ స్టైల్ కరాటే', కుంగ్‌ఫూ, తైక్వాండో చాంపియన్‌షిప్– 2025 పోటీల్లో సన్ ఫైటర్స్ కుంగ్‌ఫూ విద్యార్థులు పసిడి పతకాలు సాధించారు. రాహుల్, ప్రణీత్, విరోన్, కుమార్, రిషత, సావర్య బంగారు పతకాలు సాధించగా.. వారిని మాస్టర్ నందప్రసాద్ అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



టీఎస్ఐఐసీ కాలనీలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను ముందుకెళ్తున్నానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో పర్యటించిన ఆయన స్థానిక కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో ఏ సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో రూ. 30 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ నేతలు సోమశేఖర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భైరి నవీన్‌గౌడ్, సీఎస్ కాలనీ ప్రతినిధులు పూజ, రామ్‌చందర్, లక్ష్మీప్రియ, ప్రసాద్, మోహన్‌రావు, రామతులసి, రామ్‌చందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

బోడుప్పల్: మేడిపల్లి మండల పరిధిలో ప్రభుత్వ భూములను పరిరక్షిద్దామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, ఉమా మహేష్ అన్నారు. బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీలో సోమవారం జరిగిన మేడిపల్లి మండల సీపీఐ పార్టీ కౌన్సిల్ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వం భూకబ్జాదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మండల సీపీఐ కార్యదర్శి రచ్చ కిషన్, ప్రమీల, లక్ష్మి, బాలరాజ్, బాపరాజు, మాధవి, మహాలక్ష్మి, దండు రమేష్ ఐలయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ వాహనం బీభత్సం !



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

డ్రైవర్ టీ తాగుతుండగా ముందుకు కదిలిన వాహనం

మల్లాపూర్: జీహెచ్‌ఎంసీ జేసీబీ చిన్న వాహనం అదుపుతప్పి ద్విచక్ర వాహనాల పైకి దూసుకెళ్లిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. జీహెచ్‌ఎంసీ వాహన డ్రైవర్ వెంకటేష్ (32) మల్లాపూర్ గోకుల్‌నగర్‌లో రోడ్డు శుభ్రం చేసి మసీదు వద్ద ఇంజన్ ఆఫ్ చేయకుండా పక్కనే నిలిపి టీ తాగుతున్నాడు. ఈ క్రమంలో వైబర్షన్‌కు ఒక్కసారిగా వాహనం బేకరీ వైపు ముందుకు కదిలింది. గమనించిన డ్రైవర్ వాహనాన్ని ఆపే ప్రయత్నం చేసినప్పటికీ కంట్రోల్ కాలేదు. ఈ ఘటనలో కారు, రెండు ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టి ఆగిపోయింది. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9న రజకుల రాష్ట్ర సదస్సు

ఉప్పల్: రజక వృత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి రాజేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఉప్పల్ చౌరస్తాలో కరపత్రం విడుదల చేశారు. 9న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు కులస్తులంతా హాజరుకావాలని కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో రజకులకు ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాలనే డిమాండ్‌తో సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. సొదారం సుభద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి, ఉపేందర్, నట్టు రవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రజక సంఘం ప్రతినిధులు

కేంద్ర బలగాల అత్యుత్సాహం

కుషాయిగూడ: చర్లపల్లి టెర్మినల్ ప్రారంభోత్సవానికి హాజరయ్యేందుకు వచ్చిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొటూరి సభా ప్రాంగణం వద్దకు వెళ్తుండగా.. కేంద్ర బలగాలు అడ్డుకున్నట్లు తెలిసింది. స్థానిక పోలీసులు కలెక్టర్‌ను గుర్తించి లోపలికి తీసుకెళ్లినట్లు సమాచారం. కాగా వేదిక పైకి కూడా కలెక్టర్‌ను ఆహ్వానించలేదన్న విషయంపై చర్చ జరిగింది.

ఆకట్టుకున్న కల్చరల్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు


అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కల్చరల్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా వంటకాలను సిద్ధం చేశారు. 35 రకాల స్టాల్స్‌ను విద్యార్థులు ఏర్పాటు చేసి, అప్పటికప్పుడు రుచికరమైన వంటలను తయారు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పాల పదార్థాల తయారీ కేంద్రాలపై దాడులు



అల్వాల్: నాణ్యత లేకుండా పాల పదార్థాలను తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి 600 కిలోల పన్నీర్‌తో పాటు ఇతర పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మచ్చబొల్లారం డివిజన్‌లో ఓ మిల్క్ ట్రేడర్స్‌లో సోమవారం ఎస్ఓటీ పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని అల్వాల్ పోలీసులకు అప్పగించారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేయనున్నట్లు వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కుషాయిగూడ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నాచారం పారిశ్రామికవాడలోని తక్కిల్ ఇంద్రస్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జాతీయ రహదారి భద్రతా మహోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉమ, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

అల్వాల్: జీహెచ్‌ఎంసీ అల్వాల్ సర్కిల్ పరిధిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తులు సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జీహెచ్‌ఎంసీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని విన్నవించారు. అల్వాల్ ఔట్ సోర్సింగ్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, నగేష్, మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని వాణీనగర్‌లో ఆమె పర్యటించారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను మెరుగుపరచాలని వాణీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



కాలనీవాసులతో కార్పొరేటర్ సునీతారాముయాదవ్

ప్రణాళికా బద్ధంగా నియోజకవర్గ అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: ప్రణాళికా బద్ధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంలో వికాష్ నీతి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు డివిజన్ల వారికి ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై అప్‌లోడ్ చేస్తూ.. సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఏడాదిగా రాజీలేని పోరాటం చేస్తున్నానని, అభివృద్ధి విషయంలో కొందరు అడ్డుపడుతున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి విషయంలో నాయకులు ముందుకు రావాల్సిన అవసం ఉందన్నారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

పెరిగిన అక్రమ కట్టడాలు..

అల్వాల్ సర్కిల్‌లో అక్రమ కట్టడాలు అధికంగా పెరిగిపోయాయని అధికారులు ఇష్టానుసారంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో ఆర్‌యూబీలు, ఫ్లై ఓవర్ల నిర్మాణాలకు నిధులు మంజూయ్యాయని చెప్పారు.

ఫైర్ స్టేషన్‌కు ప్రతిపాదనలు..

అల్వాల్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు, మల్కాజిగిరిలో ఫైర్ స్టేషన్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్పొరేటర్ల ఎన్నికలు ఎప్పుడొచ్చిన తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి తన సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్పొరేటర్లు మేకల సునీతారాముయాదవ్, చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి



రాక్‌హిల్ కాలనీ నూతన సభ్యులు

అంబర్‌పేట: కాలనీలో ఆహ్లాదకరమైన వాతావరణం, అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని ఓల్డ్ సఫిల్‌గూడ, రాక్‌హిల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ అన్నారు. సోమవారం అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. కాలనీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా మహ్మద్ ఇజాజ్, కోశాధికారిగా అనిల్, సంయుక్త కోశాధికారిగా మహేష్, సలహాదారులుగా శ్రీనివాసులు, గాయత్రి, ఆర్కె. మూర్తి ఎన్నికయ్యారు. కాలనీవాసుల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ ఆందోళన

సాక్షి,సిటీబ్యూరో: 30 రోజుల నుంచి సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. వారికి మద్దతుగా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ముందు విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు పాఠశాల విద్య మెరుగు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. 30 రోజులుగా శాంతియుతంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సిబ్బంది సమ్మెలో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తుండటంతో ప్రభుత్వం వీరి సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఈవో విజయకుమారికి అందజేశారు.

